క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా బంద్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఉ.11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని విద్యుత్‌శాఖ అధికారి మాధవరావు పేర్కొన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

కేతకీలో ప్రత్యేక పూజలు



ఆత్మచైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో జహీరాబాద్ ఆత్మకమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు, పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పూల మాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, శంకర్‌పాటిల్, బక్కప్ప, మల్లికార్జున్ పాటిల్ పాల్గొన్నారు.

అమ్మవార్లకు వరద పాశం



వరద పాశం తీసుకెళ్తున్న గ్రామస్తులు

మునిపల్లి(అందోల్): ఆషాఢ మాసం సందర్భంగా ప్రతి సంవత్సరం గ్రామంలోని దేవతలకు (అమ్మవార్లకు) వరద పాశం కార్యక్రమం నిర్వహిస్తామని గ్రామ పెద్దలు చల్మెడ వీరన్న పాటిల్ తెలిపారు. సోమవారం మండలంలోని చిన్నచల్మెడ గ్రామంలో గ్రామస్తులంతా కలిసి అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో భజన చేస్తూ పాటలు పాడుతూ వరద పాశం తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు. అక్కడే అందరు కలిసి సహపంక్తి భోజనం చేశారు. వర్షాలు కురవాలని అమ్మవార్లకు నైవేద్యం సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పరమేశ్వర్, అమృతరావు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పారిశుద్ధ్యం పనులు



జేసీబీతో తొలగిస్తున్న పొదలు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగాయి. మంగల్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రం, ఎస్టీ బాలికల వసతి గృహాల చుట్టూ దట్టమైన పొదలను జేసీబీతో తొలగించారు. పలు కాలనీల్లో డ్రైనేజీలను శుభ్రం చేసి మురుగును డంపింగ్ యార్డుకు తరలించారు. చెడిపోయిన విద్యుత్తు వీధి దీపాల స్థానంలో కొత్తవాటిని అమర్చారు. ఆయా పనులను శానిటరీ అధికారి శ్రీనివాస్, విద్యుత్ విభాగం ఇన్‌చార్జి అమర్ పర్యవేక్షించారు.

వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడిగా సుకుమార్

జహీరాబాద్ టౌన్: వసాయ కార్మిక సంఘం మండల నూతన అధ్యక్షుడిగా ఎస్.సుకుమార్ నియమితులైయ్యారని జిల్లా అధ్యక్షుడుచందర్ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శిగా బి.నర్సింలు, ఉపాధ్యక్షుడిగా తుల్జరాం, కొడి నర్సింలు, ఇస్మాయిల్, లిలితమ్మ, సహ కార్యదర్శులుగా పెంటమ్మ, లక్ష్మి, బుద్ద, చిరంజీవి, లింగం, సంజీవ్, లక్ష్మణ్, కోశాధికారిగా రాజు, సభ్యులుగా నర్సమ్మ, పెంటప్ప, బీరప్ప, సుబ్బమ్మ, రత్నయ్యలు నియమితులైయ్యారు.

రేపు మహంకాళి ఆలయ వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలో మొగుడంపల్లి చౌరస్తాలోని ప్రసిద్ధ మహంకాళి దేవాలయం 26వ వార్షికోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు ప్రధాన పూజారి రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా 22న బోనాలు, రంగం ఉంటుందన్నారు. 23న అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, బలిపూజ తీర్థప్రసాదాలు, అన్నదాన వితరణ, భక్తి గీతాల పాన, భజనలు, కీర్తనలు, సంస్కృతి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

తూతూమంత్రంగా తనిఖీలు

- యథేచ్ఛగా కల్తీకల్లు విక్రయాలు
- పట్టించుకోని ఆబ్కారీ అధికారులు
- నామమాత్రంగా శాంపిల్స్ సేకరణ
- సామాన్య ప్రజలపై కల్తీకల్లు తీవ్ర ప్రభావం



కల్లుదుకాణంలో శాంపిల్ సేకరిస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): ఉమ్మడి మండలంలో కల్తీ కల్లు తయారీ అమ్మకాలు జోరుగా సాగుతోంది. పట్టించుకునే వారు లేక ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్తీకల్లు బారినపడి అమాయకుల జీవితాలను చిద్రమవుతున్నాయి. కల్తీకల్లు విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామాల్లో జోరుగా కల్తీకల్లు విక్రయాలు

గుమ్మడిదల మండలంలోని పలు గ్రామాల్లో గీతా కార్మికులు జోరుగా కల్తీకల్లు విక్రయాలు సాగిస్తున్నారు. అల్ప్రాజోలం, డైజోఫాం వంటి మత్తు పదార్థాలతో కల్తీకల్లు తయారు చేయడమే కాకుండా దుకాణాల్లో పెద్ద ఎత్తున విక్రయాలు చేస్తున్నారు. ఇటీవల కూకట్‌పల్లిలో జరిగిన సంఘటన నేపథ్యంలో పెద్ద ఎత్తున కల్తీకల్లు విక్రయాలపై ఆబ్కారీ శాఖ అధికారులు రంగంలోకి దిగి కల్లు దుకాణాలపై దాడులు చేశారు. గుమ్మడిదల మండలంలో బొంతపల్లి, దోమడుగు, మంబాపూర్, నల్లవల్లి గుమ్మడిదల తదితర గ్రామాల్లోని దుకాణాలపై పెద్ద ఎత్తున ఆకస్మిక తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరించారు. శాంపిల్ రిపోర్టులు ఆధారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తనిఖీలు శూన్యం

కల్తీకల్లు విక్రయాలు జోరుగా సాగడానికి ప్రధాన కారణం ఆబ్కారీ అధికారుల నిర్లక్ష్యమేనని స్థానికంగా వినిపిస్తోంది. గ్రామాల్లో విచ్చలవిడిగా కల్తీ కళ్ళు తయారు చేస్తూ విక్రయాలు జరుపుతున్నా కనీసం తనిఖీలు చేయకుండా ఆబ్కారీ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి కల్తీకల్లు తయారీపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘన

ఆబ్కారీ శాఖ అనుమతులు లేకుండానే దుకాణాలు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కల్తీకల్లు విక్రయాలకు ప్రధానంగా గీతా కార్మికులేనని మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఒక్కో గీతా కార్మికుడు తాటికల్లు దుకాణం నడిపించాలంటే తప్పనిసరిగా 30 చెట్ల లెక్క చూపించడంతో పాటు స్థానికుడై ఆరోగ్యవంతుడై చెట్టు ఎక్కి కల్లు తీయగలిగిన వారై ఉండాలనేది ప్రధాన నిబంధన ఉంది. కానీ అవేవీ పాటించకుండా గ్రామాల్లో విచ్చలవిడిగా కల్తీకల్లు విక్రయాలు జరుగుతున్నాయని, కనీసం వీటిని ఆబ్కారీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సామాన్యుల జీవితాలపై ప్రభావం చూపుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్తీకల్లుకు బానిసలైన వ్యక్తులు అవి లేకుంటే మతిభ్రమించినట్లుగా ప్రవర్తిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికారులు దుకాణాలను మూసేయడంతో కల్లు దొరక్క బాధితులు పిచ్చి పట్టినట్లుగా వ్యవహరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మనోజ్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధి మారేపల్లి, గంగారం, తమ్మలిభాయి తండా, హరిదాస్ పూర్ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కుటుంబాలను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ పరామర్శించారు. వారి కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని భరోసా కల్పించారు. మారేపల్లిలో మాజీ ఎంపీపీ మనోజ్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి, గంగారం బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, హరిదాస్‌పూర్‌లో బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ సత్యాగౌడ్ మనవరాలు ఇటీవల అకాల మరణం, తమ్మలిభాయి తండా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చక్రనాయక్ మృతి చెందడంతో సోమవారం ఎమ్మెలే చింతా ప్రభాకర్ ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కొండాపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విఠల్, గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పాండురంగం, పీఏసీఎస్ చైర్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- పాడైన వంతెన రేలింగ్
- ఏళ్లు గడుస్తున్నా.. పట్టించుకోని అధికారులు
- ఆదమరిస్తే పెనుప్రమాదమే



పూర్తిగా పాడైన వంతెన రేలింగ్



రేలింగ్‌లో తేలిన ఇనుప చువ్వలు

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న వంతెన రేలింగ్ పాడవడంతో ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు ఏ మాత్రం ఆదమరుపుగా వాహనాలను డ్రైవింగ్ చేసినా నేరుగా వాహనాలు వాగులో పడిపోయే ప్రమాదం ఉంది. రేలింగ్ పాడై పుష్కరకాలం గడుస్తున్నా అధికారులు మరమ్మత్తులపై దృష్టి సారించకపోవడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరిగే ప్రధాన రోడ్డుపై భద్రత లేకుండా రాకపోకలు సాగుతున్నాయి. తరుచూ వంతెనపై నుంచే రాకపోకలు సాగించే అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వంతెన నిర్మాణాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం

వ్యవసాయ మార్కెట్ సమీపం నుంచి ప్రవహించే వాగుపై నాలుగు దశాబ్దాల క్రితం ఈ వంతెన నిర్మించారు. 2016లో వాగులో వరదనీరు ఉధృతంగా పారడంతో వంతెన దెబ్బందింది. రేలింగ్‌లోని ఇనుప చుక్కలు తేలాయి. అప్పటినుంచి వంతెనకు మరమ్మతు చేయాలని కోరుతున్నా ఫలితం లేకుండా పోయింది. ఇటీవల వంతెనకున్న ఒకసైడు రేలింగ్ ఒక్కసారిగా పడిపోయింది. ఏ మాత్ర అజాగ్రత్తగా వాహన నడిపినా వాగులోకి దూసుకుపోయో పెనుప్రమాదం ఉంది.

వర్షాలు కురవాలని పూజలు



ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నారాయణఖేడ్: వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండు ముఖం పట్టాయి. దీంతో సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుకుంటూ ఖేడ్ మండలం చాప్టా(కే) గ్రామంలో సోమవారం ప్రత్యేక జలదిగ్బంధ పూజ నిర్వహించారు. మహిళలు తలలపై 500 నిండు కలశాలతో గ్రామ హనుమాన్ మందిరం వరకు బాజా భజంత్రీలతో వెళ్లారు. జలదిగ్బంధ పూజలో భాగంగా ఆంజనేయ స్వామికి జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిపించాలని కోరుకున్నారు.

ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కి ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: ఫలహారం బండి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించే ఫలహారం బండి ఊరేగింపుకి రావాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌కి నిర్వాహకులు సోమవారం ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మంగళవారం సాయంత్రం పటాన్‌చెరు పాత మార్కెట్ నుంచి ఏడు పోచమ్మల దేవస్థానం వరకు ఊరేగింపు ఉంటుందన్నారు.

పోటాపోటీగా ఎన్నికలు

పటాన్‌చెరు: మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామపంచాయతీ పీఎస్ఆర్ టౌన్ షిప్ కమిటీ అధ్యక్షుడిగా జి నాగరాజు ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానానికి ఇద్దరు వ్యక్తులు పోటీ చేశారు. మొత్తం 866 సభ్యులు ఉండగా 702 ఓట్లు పోలయ్యాయి, మొదటి అభ్యర్థి అయినా నాగరాజుకు 420 ఓట్లు నమోదు కాగా, రెండు అభ్యర్థి అయిన మురళి కి 270 ఓట్లు పడ్డాయి.18 ఓట్లు చెల్లని గా నమోదు అయ్యాయి. 150 ఓట్ల ఆధిక్యంతో నాగరాజు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ... తన గెలుపుకు కృషి చేసిన సభ్యులందరికీ ధన్యవాదాలు చెప్పారు. టౌన్ షిప్‌లో నివసించే సభ్యులందరికి అందుబాటులో ఉంటూ వారి సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు.

27న వివాహ పరిచయ వేదిక

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 27న వీరశైవ లింగాయత్, జంగమ సమాజం వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పసారం శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.10 గంటల నుంచి సా. 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. జిల్లాలోని వీరశైవ లింగయాత్, లింగ బలిజ, జంగమ సమాజంలో పెళ్లి కావాల్సిన వధువరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివాహ పరిచయ వేదికలో పాల్గొనే వారు ఈ నెల 24 లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 92463 59842 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



నేలకు ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

హత్నూర(సంగారెడ్డి): ఇళ్ల మధ్య ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఏ ప్రమాదం జరుగుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హత్నూర మండలం సిరిపురం గ్రామంలో ఇళ్ల మధ్య నేలపై ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మూగజీవాలు ప్రమాదానికి గురై మృతి చెందాయని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఇళ్లమధ్య నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


లోవోల్టేజీ సమస్య పరిష్కారం



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆయా కాలనీల పెద్దలు

నారాయణఖేడ్: పట్టణంలోని రాంవిలాస్ గల్లీ, నెహ్రూనగర్, శాస్త్రీనగర్, బ్రాహ్మణగల్లీ తదితర కాలనీల్లో విద్యుత్తు లోవోల్టేజీతో తరచూ సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. దీంతో ఆయా కాలనీవాసులు సమస్యను ఎమ్మెల్యే సంజీవరెడ్డికి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అధికారులు సోమవారం ఆయా కాలనీలకు విద్యుత్తు సరఫరా చేసే అంబేడ్కర్ చౌక్ సమీపంలోని ముస్లిం స్మశానవాటిక వద్ద 160 కేవీ సామర్థ్య గల ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. విద్యుత్తు తీగలకు తగులుతున్న చెట్లను తొలగించారు. దీంతో ఆయా కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

పేలిన పీటీ ట్రాన్స్‌ఫార్మర్



పేలిపోయిన పీటీ ట్రాన్స్‌ఫార్మర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీ సమీపంలోని ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున పీటీ ట్రాన్స్‌పార్మర్ పేలింది. దానికి సంబంధించిన పరికరాలు ఇళ్లపై పడటంతో ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. అదే సమయంలో సబ్‌స్టేషన్‌కు వంద మీటర్ల దూరంలోని ఈశ్వర్ ఇంటి ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఓ పరికరం పడి పెద్దశబ్దం రావడంతో వారు భయభ్రాంతులకు గురైయ్యారు. ఈ ప్రమాదం పగటిపూట జరిగుంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించి బీఆర్ఎస్ సత్తా చాటాలని మానకొండూర్ మజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. ఓ స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమాయత్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటువేసి హామీలు నెరవేరక ఇప్పుడు బాధపడుతున్నారని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. ముఖ్య నాయకుల అభిప్రాయం మేరకే అభ్యర్థులను ఎంపిక చేస్తామని, ప్రతి గ్రామంలో ఎంపికైన అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో సిద్దం వేణు, నిర్మల, శ్రీనివాసరావు, లక్ష్మణ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



పటాన్‌చెరు టౌన్: నృత్యాలు చేస్తున్న కళాకారులు

అంబరాన్నంటిన బోనాల జాతర

ఆషాఢమాసం బోనాల సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు బోనాలు, ఫలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. కళాకారులు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ప్రజలందరూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆయా గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు.



పటాన్‌చెరు: కళాకారులతో మహిపాల్ రెడ్డి



నారాయణఖేడ్: బోనాలతో మహిళలు



జిన్నారం : పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



జహీరాబాద్ టౌన్: పూజలు చేస్తున్న భక్తులు

పచ్చదనంతో తహసీల్ తళుకు

తహసీల్ కార్యాలయంలో వేగంగా అభివృద్ధి పనులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన గార్డెనింగ్ పనులు

జహీరాబాద్ టౌన్: ఎండిపోయిన చెట్లు, మొక్కలతో వెలవెలబోయిన తహసీల్దార్ కార్యాలయం వద్ద సుందరీకరణ పనులు చేపట్టడంతో పచ్చదనంతో కళకళలాడుతోంది. రెండు నెలల క్రితం బదిలీపై వచ్చిన తహసీల్దార్ దశరథ్ ప్రత్యేక చొరవ తీసుకుని కళాహీనంగా తయారైన కార్యాలయం ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో విశాలమైన స్థలం ఉంది. గతంలో పని చేసిన తహసీల్దార్లు ఇతర అధికారులు పచ్చదనంపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి పనులు చేయించారు. ఖాళీ స్థలంలో మొక్కలు నాటించి ప్రగతి పనులు చేపట్టారు. రెండు సంవత్సరాల నుంచి అధికారులు చెట్లు, మొక్కల సంరక్షణపై శ్రద్ధ వహించడం మానేశారు. దీంతో ఎండిన చెట్లు, మొక్కలు, రాలిన ఆకులను శుభ్రం చేసేవారు లేక ఆటవీ ప్రాంతాన్ని తలపించింది. వర్షాలకు ప్రహరీ కూలినా మరమ్మతులు చేయించలేదు. దీంతో తహసీల్దార్ కార్యాలయం కళావిహీనంగా తయారైంది.

శరవేగంతో అభివృద్ధి పనులు

కొత్తగా వచ్చిన తహసీల్దార్ దశరథ్ సుందరీకరణ పనులు శరవేగంగా చేయించారు. కూలిపోయిన ప్రహరీకి మరమ్మతులు చేయించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు గార్డెనింగ్ పనులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తున్నారు. చెత్త చెదారాన్ని పూర్తిగా తొలగించి శుభ్రం చేయించారు. మూత్రశాలలు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొత్తగా మూత్రశాలలు కట్టిస్తున్నారు. పలు బైక్‌లు, కార్లు పార్కింగ్ చేయకుండా గేట్‌ను ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం కార్యాలయం కళకళలాడుతుంది.